ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

1 కర్నూలు
జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

వెల్దుర్తిలో ఆగిన 'వందే భారత్'

వెల్దుర్తి, ఏప్రిల్, 25: హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న వందే భారత్ రైలు గురువారం వెల్దుర్తి రైల్వేస్టేషన్‌లో సుమారు 15 నిమిషాల పాటు నిలిచింది. అదేసమయంలో (వందే భారత్ రైలు వస్తుందని) నంద్యాల నుంచి కర్నూలు వెళ్తున్న డెమోను ముందస్తుగా రైల్వేస్టేషన్‌లో అరగంట సేపు నిలిపారు. గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఏపీఆర్ఎస్ పరీక్షలకు కర్నూలుకు సమయానికి చేరుకోలేమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. సిగ్నలింగ్ వ్యవస్థ లోపం కారణంగా వందే భారత్ రైలు ఆగినట్లు రైల్వే వర్గాల సమాచారం.

ఆలూరు అసలే వెనుకబడిన ప్రాంతం. పశ్చిమ కర్నూలు జిల్లాలో కరువు, వలస, పేదరికం, నిరక్షరాస్యత మొదలైనవి తాండవించే నియోజకవర్గం. నీటి పారుదల రంగంలో ఘోరంగా దగా పడింది. దీని వల్ల సుస్థిర అభివృద్ధి ఊసే లేకుండాపోయింది. ఇలాంటి నియోజకవర్గాన్ని ఐదేళ్ల వైసీపీ పాలన మరింత అధ్వానంగా తయారు చేసింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు ఆలూరు నియోజకవర్గానికి అంతులేని హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్కటి కూడా ముఖ్యమంత్రి అయ్యాక ఆయనకు గుర్తు లేదు. అప్పట్లో జగన్ పాదయాత్ర ఆస్పరి మండలంలో కారుమంచి, పుప్పాలదొడ్డి మీదుగా బిలేకల్లు వరకు సాగింది. బిలేకల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో వాగ్దానాలు ఎన్నో గుమ్మరించారు. కానీ ఆలూరు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ప్రజల సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదు.


ఆలూరు ప్రధాన రహదారి

ఆలూరంటే అలుసే



- నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్న స్థానికులు
- తీరని తాగు నీటి కష్టాలు
- నిధులు లేక ఆగిపోయిన వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు
- జాడలేని జింకల పార్కు
- పూర్తికాని జాతీయ రహదారి పనులు

ఆలూరు, ఏప్రిల్ 25: వైసీపీ ప్రభుత్వానికి వెనుకబడిన ఆలూరు నియోజవర్గమంటే అలుసే. ప్రజలు కోరుకున్న కనీస అవసరాలు తీర్చకుండా ఐదేళ్ల పాలన ముగించుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఓట్లు వేయమని వైసీపీ ప్రజల ముందుకు వస్తోంది. ఈ సందర్భంలో జగన్ విస్మరించిన హామీలను ప్రజలు గుర్తు చేస్తున్నారు.



- ప్రతిపక్ష నేత హోదాలో జగన్ పాదయాత్ర చేసినప్పుడు స్థానిక రైతులు జింకల బెడద వల్ల పంటలు నష్ట పోతున్నాయని తెలిపారు. దీనికి ఆయన తమ పార్టీ అధికారంలోకి వస్తే జింకల పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అది ఏ మాత్రం అమలుకు నోచుకోలేదు.
- ఆలూరు ప్రాంతంలో 80 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు వేదవతి నదిపై జలాశయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయితే పనులు ప్రారంభించి రైతుల పొలాల్లో పైప లైన్‌లు వేసి పరిహారం కూడా ఇవ్వలేదు. రూ. వంద కోట్లు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోయింది.
- వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని జగన్‌ను వాల్మీకి సంఘాలు కోరగా అధికారంలోకి వచ్చాక ఎస్టీ జాబితాలోకి వాల్మీకి బోయలను చేరుస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు.
- అస్పరిలో తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ పరిష్కారం కాకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అస్పరి, జొహర పురం, కారుమంచి, బిలేకల్, కైరుప్పల, డి. కోటకొండ, ములుగుందం, శంకర్ బండ గ్రామాల్లో 12 రోజులకు ఒక్కసారి మాత్రమే నీరు సరఫరా అవుతున్నది.


ఆస్పరి మండలం జొహరాపురంలో నీటి కోసం కష్టాలు

ఆస్పత్రిలో వైద్య సేవలు అంతంత మాత్రమే..

ఆలూరు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో ఆదోని, బళ్ళారి ఆస్పత్రులకు సిబ్బంది రెఫర్ చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో వైద్యం అందుబాటులోకి తెచ్చి పూర్తి స్థాయిలో వైద్యులను, వసతులు కలుస్తానని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు.

ఆలూరు నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు

- నియోజకవర్గ కేంద్రంలో బస్ డిపో లేదు.
- ఆలూరు ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ కళాశాలలకు సొంత భవనాలు లేవు.
- ఆలూరు పట్టణంలో మురుగు సమస్య పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైన్ ఏర్పాటు చేయాలి.
- తాగు నీరు 15 రోజులకు ఒక్కసారి సరఫరా అవుతుంది. శాశ్వత పరిష్కారం కోసం అదనంగా మరో రెండు సమ్మర్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేసి బాపురం రిజర్వాయర్ సామర్థ్యం పెంచి చెరువులను నింపాల్సిన అవసరం ఉంది.
- చిప్పగిరి మండలంలో పెండింగ్‌లో ఉన్న నగరడోన ప్రాజెక్టును నిర్మించాలి.
- హెచ్ఎల్‌సీ ద్వారా ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి వాటా సక్రమంగా అందించాలి..
- హెచ్ఎల్‌సీ కాలువపై తూము ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లు మంజూరు కాగా జగన్ ప్రభుత్వం వచ్చాక రద్దు చేసింది. ఈ సమస్యను పరిష్కరించాలి.
- ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు మరమ్మతుల కోసం గత ఐదేళ్లుగా నిధులు రాకపోవడంతో పూడికలు, ముళ్ళ కంపలు పేరుకుపోయాయి. దీంతో ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి మండలాల్లో 14,285 ఎకరాలకు నీరు అందకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా పూడికలు తీసుకున్నారు.
- అస్పరి మండలంలో డీ కోటకొండ, ముత్తుకూరు రహదారులు అధ్వానంగా ఉన్నాయి.
- టమోటా సాగు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు.


నిర్మాణదశలో నిలిచిపోయిన వేదవతి ప్రాజెక్టు

వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలి



ఆలూరు ప్రాంతంలో కరువు కాటకాలతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఎల్ఎల్‌సీ ద్వారా వచ్చే నీరు కర్ణాటక రైతుల చౌర్యం వల్ల సక్రమంగా నీటి వాటా రావడం లేదు. గతంలో ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్ వేదవతిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కానీ నిధులు ఇవ్వకపోవడం వల్ల పనులు ఆగిపోయాయి. వేదవతి పూర్తి అయితే 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

-అంజినయ్య, రైతు, అరికెర, ఆలూరు మండలం

మాట తప్పిన జగన్



బోయ వర్గాలను ఎస్టీ జాబితాలోకి చేరుస్తామని జగన్ వచ్చిన హామీ అమలు కాలేదు. బోయలను ఓట్ల కోసం జగన్ వాడుకున్నారు. ఇచ్చిన హామీ తప్పారు.

-భాస్కర్ నాయుడు, వాల్మీకి బోయ సాధికార కమిటీ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు

తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం



తాగు నీరు 12 రోజులకు ఒకసారి మాత్రమే సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. మా ప్రాంతాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదు.

-భాను, జోహరాపురం


పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలి



నియజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి మెరుగైన వైద్య సేవలు అందించాలి. రాత్రి సమయాల్లో కూడా వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూడాలి.

-బెంగళూర్ కిషోర్, టీడీపీ నాయకుడు, ఆలూరు

జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలి



ఏళ్ల తరబడి జాతీయ రహదారి నిర్మాణం పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేయకపోవడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలూరు శివారులో, పట్టణంలో ఇంకా నిర్మాణ పనులు పూర్తి కాలేదు. దీంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. వైసీపీ ప్రభుత్వం కనీస అభివృద్ధి పనులు కూడా చేయలేదు.

-నారాయణ స్వామి, ఆలూరు

న్యాయాధికారుల బదిలీ

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 25: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో ఖాళీగా ఉన్న ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్‌గా విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పని చేస్తున్న ఎం.సరోజమ్మను బదిలీ చేశారు. బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పని చేస్తున్న కిషోర్ కుమార్‌ను ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేశారు. డోన్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న పి.హనీషాను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఈ స్థానంలో చిత్తూరు జిల్లా పీలేరు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న సాకే జ్యోతిని నియమించారు. ఖాళీగా ఉన్న నందికొట్కూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్థానంలోకి పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్యను బదిలీ చేశారు. ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న గురు అరవింద్‌ను చిత్తూరు జిల్లా వాయల్పాడు కోర్టుకు బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న ఆదోని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో పని చేస్తున్న ఎం.లీలాసాయి సుభాష్‌ను నియమించారు. నంద్యాల అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న జి. అర్చనను ఖాళీగా ఉన్న ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. బదిలీలు అయిన ఈ న్యాయాధికారులందరూ మే నెల 3వ తేదీలోగా బాధ్యతలు స్వీకరించాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులో పేర్కొంది.

జేఈఈ తేజం

- మెయిన్స్‌లో రాణించిన కర్నూలువాసి
- ఆలిండియా స్థాయిలో 83వ ర్యాంక్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 25: జేఈఈ-మెయిన్స్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలు నగరానికి చెందిన కోడూరు తేజేశ్వర్ సత్తా చాటాడు. ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 83వ ర్యాంకు సాధించాడు. తేజేశ్వర్ తల్లిదండ్రులు కోడూరు శేఖర్, భార్య కృష్ణవేణి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. కర్నూలులో నివాసం ఉంటున్నారు. ఎస్.తేజేశ్వర్ విజయవాడలో ఎస్ఐటీ-జేఈఈ ఫిట్‌లో ఇంటర్ చదువుతున్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో 981 మార్కులు వచ్చాయి. జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో 99.9981 పర్సంటైల్ సాధించి ఆలిండియా స్థాయిలో 83వ ర్యాంకు సాధించాడు. జేఈఈ- అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచిర్యాంకు సాధించి దేశంలో ప్రఖ్యాతిగాంచిన విద్యాసంస్థల్లో చేరడమే లక్ష్యమని తేజేశ్వర్ వివరించాడు.


కోడూరు తేజేశ్వర్ ఆలిండియా స్థాయిలో 83వ ర్యాంకు

పోటెత్తిన అభిమాన దండు

- టీడీపీ అభ్యర్థులు టీజీ భరత్, రాఘవేంద్రరెడ్డి నామినేషన్లు
- కర్నూలులో తరలివచ్చిన టీడీపీ శ్రేణులు
- మంత్రాలయంలో కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న టీజీ భరత్

కర్నూలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కీలక ఘట్టం నామినేషన్ల పర్వం గురువారం ముగిసింది. సాయంత్రం 3 గంటలకు నామినేషన్ల స్వీకరణకు తెర పడింది. చివరి రోజు పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. కర్నూలు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ నామినేషన్ ర్యాలీ అట్టహాసంగా సాగింది. ఓల్డ్ టౌన్ (పాత బస్తీ) సహా నగరం నలుమూల నుంచి టీడీపీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చాయి. కూటమి మిత్ర పక్షాలు జనసేన, బీజేపీ శ్రేణులు భరత్ ర్యాలీలో పాల్గొన్నాయి. పెద్దమార్కెట్ రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ రిటైర్డ్ ఐజీ ఇక్బాల్, జనసేన ఇన్‌చార్జి అర్షద్, బీజేపీ కన్వీనర్ సూర్యప్రకాశ్, టీజీ విభులతో పాటు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ముఖ్య నాయకులతో కలసి టీజీ భరత్ అంబేడ్కర్ సర్కిల్, కొండారెడ్డి బురుజు, కంట్రోల్ రూం సర్కిల్, చిల్డ్రన్ పార్కు మీదుగా ర్యాలీగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఎ.భార్గవతేజ ఆఫీసుకు చేరుకున్నారు. గజ మాలలతో టీజీ వెంకటేశ్, టీజీ భరత్‌లను అభిమానులు సత్కరించారు. అనంతరం ఆర్ఓ ఏ.భార్గవతేజకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

నామినేషన్ దాఖలు చేసిన మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం టీడీపీ అభ్యర్థి మాదవరం నల్లగొని రాఘవేంద్రరెడ్డి మాదవరం గ్రామం నుంచి ఎనిమిది కిలో మీటర్లు భారీగా ర్యాలీతో మంత్రాలయం ఆర్ఓ కార్యాలయం చేరుకుని నామినేషన్ దాఖాలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, బీజేపీ ఆదోని డివిజన్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జనసేన ఇన్‌చార్జి బి.లక్ష్మన్నలతో కలసి మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు మండలాల నుంచి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలసి మాధవరం, మాలపల్లి మీదుగా 8 కిలో మీటర్లు ర్యాలీ నిర్వహిస్తూ మంత్రాలయం చేరుకున్నారు. టీడీపీ అభ్యర్థి రామవేంద్రరెడ్డి సహా కూటమి నాయకులను తెలుగుతమ్ముళ్లు గజమాలలతో సత్కరించారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- 184 మంది అభ్యర్థులు.. 282 నామినేషన్లు
- ఎంపీకి 41.. ఎమ్మెల్యేలకు 241..
- ఆఖరి రోజు 97 దాఖలు

కర్నూలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రధానమైన నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. కర్నూలు పార్లమెంట్ స్థానం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టరు డాక్టర్ జి.సృజన, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఓలు ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లను స్వీకరించారు. గురువారం సాయంత్రం 3 గంటలకు ఆ ఘట్టానికి తెర పడింది. కర్నూలు పార్లమెంట్ సహా కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 184 మంది అభ్యర్థులు 282 నామినేష్లు దాఖాలు చేశారు. చివరి రోజు గురువారం అత్యధికంగా 97 నామినేషన్లు వచ్చాయి. ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, వైసీపీ అభ్యర్థి బీవై రామయ్య సహా 41 మంది అభ్యర్థులు 56 నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీ అభ్యర్థులు టీజీ భరత్, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరెడ్డి, మాధవరం ఎన్.రాఘవేంద్రరెడ్డి, వీరభద్రగౌడ్, కేఈ శ్యాంబాబు, గౌరు చరిత, బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి సహా 157 మంది అభ్యర్థులు 241 నామినేషన్లు దాఖాలు చేశారు. నేడు (26వ తేదీ) నామినేషన్ల పరిశీలన ఉంటుంది. దీంతో అభ్యర్థుల్లో ఉత్కంఠత నెలకొంది. 29వ తేదీ నామినేషన్ల ఉప సంహరణకు ఆఖరు గడువు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు బరిలో నిలిచేవారి జాబితా తేలనుంది.

నియోజకవర్గాల వారిగా నామినేషన్లు, అభ్యర్థులు

నియోజకవర్గం	నామినేషన్లు	అభ్యర్థులు
కర్నూలు పార్లమెంట్	41	27
కర్నూలు అసెంబ్లీ	56	41
కోడుమూరు (ఎస్సీ)	31	21
ఎమ్మిగనూరు	28	16
మంత్రాలయం	17	12
ఆదోని	23	16
ఆలూరు	25	15
పత్తికొండ	24	14
పాణ్యం	37	23
మొత్తం	**282**	**184**

క్లీన్‌స్వీప్ చేస్తాం

- ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో కూటమి గెలుపు ఖాయం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు

మంత్రాలయం, ఏప్రిల్ 25: తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేస్తున్న ఎంపీతోపాటు ఆరుగురు టీడీపీ అభ్యర్థులు, ఆదోని బీజేపీ అభ్యర్థులు విజయం సాధించి జిల్లాను క్లీన్‌స్వీప్ చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మంత్రాలయం తిక్కారెడ్డితో పాటు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, బీజేపీ ఆదోని డివిజన్ ఇన్‌చార్జి హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తంరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి, బీటీ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న వైసీపీ దౌర్జన్యాలు, అక్రమాలు, గుండాయిజం, రౌడీయిజం, దోపిడీలను అరికట్టేందుకు ప్రజలు తిరగబడుతున్నారన్నారు. మరో 20 రోజుల్లో జగన్ ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఐక్యంగా వైసీపీ గూండాలను ఎదుర్కొని టీడీపీకి ఓటు వేయించే బాధ్యతను తెలుగు తమ్ముళ్ల తీసుకోవాలన్నారు. ఎవరికీ కూడా భయపడాల్సిన అవసరం లేదని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అండగా ఉంటాయని భరోసానిచ్చారు. మంత్రాలయం నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక, మద్యం వ్యాపారాలు కొనసాగిస్తూ వైసీపీ అన్యాయానికి పాల్పడుతోందని ఆరోపించారు. ఈసారి వైసీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 140 సీట్లకు పైగా కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి, నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పన్నగ వెంకటేశ్ స్వామి, పూజారి వ్యాసరాజాచార్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, విజయరామిరెడ్డి, చిన్న భీమ, నరసింహ, హనుమంతు, నవకోటి నారాయణ, నాగరాజు, యేబు, శివ, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు

ఆళ్లగడ్డపై శోభా నాగిరెడ్డి మార్క్

తొలి మహిళా ఎమ్మెల్యే



ఆళ్లగడ్డ, ఏప్రిల్ 25: రాష్ట్ర రాజకీయాల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గానికి ఎప్పటికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. కుటుంబ, ఫ్యాక్షన్ రాజకీయాల మధ్యే ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరుగుతుంటాయి. ఇంతటి పేరున్న ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దివంగత శోభానాగిరెడ్డికి ప్రత్యేకత ఉంది. ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి ఎన్నికైన తొలి మహిళా ఎమ్మెల్యేగా ఆమె చరిత్రలో నిలిచిపోయారు. 1997లో ఆళ్లగడ్డ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన శోభా నాగిరెడ్డి.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇరిగెల రాంపుల్లారెడ్డిపై 37 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తరువాత 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో సైతం టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల సమయంలో ఆమె రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. అయితే అప్పటికే ఎన్నిక నిర్వహణ అనివార్యమైంది. దీంతో మృతి చెందిన తర్వాత కూడా ఆళ్లగడ్డ ప్రజలు శోభానాగిరెడ్డిని గెలిపించారు. అనంతరం ఆమె కుమార్తె భూమా అఖిలప్రియ ఏకగ్రీవంగా ఎన్నికై తండ్రి భూమా నాగిరెడ్డితో కలిసి అసెంబ్లీకి వెళ్లారు.

అప్పట్లో 21 ఏళ్లకు ఓటు హక్కు..!

మీకు తెలుసా



బనగానపల్లె/శిరివెళ్ల, ఏప్రిల్ 25: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో ఏడు దశాబ్దాల కాలంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. భారతదేశంలో మొదట సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్‌లో సుకుమార్‌జైన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలి భారతదేశ ఎన్నికల్లో 17.90 కోట్ల ఓటర్లకు ఓటువేసే అవకాశం కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1985 వరకు ఓటు హక్కు కనీస వయస్సు 21 సంవత్సరాలుగా ఉండేది. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటుహక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990లో ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన భారతదేశ మొదటి సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 55 పార్టీలు బరిలో నిలవగా 2014నాటికి ఆసంఖ్య 370కి చేరింది. ఎన్నికల నిర్వహణలో కేంద్ర ఎన్నికల సంఘం ఏడు దశాబ్దాల్లో అనేక సంస్కరణలు చేపట్టింది. బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించే విధానం నుంచి ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేసారో తెలుసుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీప్యాట్) యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు.

ఊదరగొడితే కేసుల మోత

బీ అలర్ట్




శిరివెళ్ల, ఏప్రిల్ 25: ఎన్నికల సందడి మొదలైందంటే చాలు... పట్టణాల్లో, గ్రామాల్లో మైకులు హోరెత్తుతుంటాయి. మీ ఓటు మాకే అంటూ పాటల రూపంలో, అనుకరణల మధ్య పార్టీల పేరుతో ఊదరగొట్టడం సర్వసాధారణం. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓట్లు అభ్యర్థించేందుకు ఇంటింటికి తిరగడం, రోడ్ షోలు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. పర్యావరణ చట్టాలు, నిబంధనలను అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలి. ప్రచార సాధనాల మోత చెవుల్లో మార్మోగుతుంది. హద్దులు మీరిన శబ్దాలతో తలబొప్పి కడుతుంది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా డీజే శబ్దాలతో విపరీత ధోరణికి పోవడం సమస్యగా మారుతుంది. చట్టపరంగా ఏ మేరకు ధ్వని వినియోగించుకోవాలో ఎన్నికల సంఘం నిర్ణయించింది. శబ్దం పెరిగిందా.. కేసు నమోదు కావాల్సిందే. ప్రచారంలో పెద్ద పెద్ద స్పీకర్లు, డీజే బాక్సుల వినియోగం నిషేధం. ప్రచారంలో భాగంగా నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్ శబ్ద తీవ్రత, విద్యాలయాలు, న్యాయస్థానాలు, వైద్యశాలల సమీపంలో 40 నుంచి 50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ శబ్ద తీవ్రతతో ప్రచారం నిర్వహించవచ్చు. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు శిక్షపడే అవకాశం ఉంది.

ఎన్నికలు ఖరీదు



కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 25: ఎన్నికలు అత్యంత ఖరీదుగా మారాయి. ఎన్నికల్లో పోటీకి నిలవాలంటే రూ.కోట్లు కుమ్మరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఇలా ఎన్నిక ఏదైనా సరే డబ్బులు విచ్చలవిడిగా పంచాల్సిందే. మద్యం, మనీ తప్పనిసరి అయ్యాయి. నోటు లేనిదే ఓటు రాదు అన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయి. సామాన్యులు సైతం రాజకీయాల్లో రాణించాలని ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తుంటే పోటీలో నిలబడే అభ్యర్థులకు ఆర్థిక స్తోమత ప్రధాన సమస్యగా మారుతోంది. గతంలో పోటీలో నిలబడే అభ్యర్థుల గుణ గణాలు, వారు చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేసే ఓటర్లు, నేడు ఎవరు ధనికులైతే వారిదే గెలుపు అన్నవిధంగా పరిస్థితులు మారిపోయాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి సీటుపై కూర్చున్న నాయకుడు తిరిగి ఎలా సంపాదించాలా అన్న ఆలోచనతో పాలనసాగిస్తున్నాడు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఎన్నికల ఖర్చు ఇంకెంత వరకు వెళుతుందోనన్న ఆందోళన రాజకీయ వర్గాలు, మేధావుల్లో వ్యక్తమవుతోంది.

వైసీపీలో రివర్స్ గేర్





- మంత్రి బుగ్గనపై తిరుగుబాటు
- ప్రచారానికి దూరం
- ఆత్మీయ సమావేశాలతోనే సరి



ఆత్మీయ సమావేశంలో మంత్రి బుగ్గన (ఫైల్)

డోన్, ఏప్రిల్ 25: డోన్ నియోజకవర్గంలో కనుసైగలతో శాసించిన మంత్రి బుగ్గన ఎన్నికల వేళ దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాను చెప్పిందే వేదం అన్నట్లు పాలన సాగించిన బుగ్గన ఇలాకాలో అంతా రివర్స్ గేర్ నడుస్తోంది. ఎన్నికల కోడ్ ముందు వరకు ప్రజల్లో పోలీసు ఎస్కార్ట్‌తో అధికార దర్పాన్ని ప్రదర్శించిన మంత్రి బుగ్గన.. ఆ తర్వాత ప్రచారాలకు దూరంగా ఉండటంతో రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. కేవలం ఆత్మీయ సమావేశాలకే పరిమితమై బుగ్గన ప్రచారం చేస్తుండటంపై ప్రజలు విస్తుపోతున్నారు. నిలదీతల భయంతోనే ప్రచారాలకు దూరంగా ఉన్నాడనే టాక్ ప్రజల్లో వినిపిస్తోంది. డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు సార్లు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో సీఎం జగన్ క్యాబినెట్‌లో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా బుగ్గన పని చేశారు. దీంతో ఆర్థిక మంత్రిగా బుగ్గన డోన్ నియోజకవర్గంలో తిరుగులేని హవా నడిపించాడు. ఢిల్లీ, అమరావతి నుంచే రిమోట్ కంట్రోల్‌గా బుగ్గన డోన్ నియోజకవర్గాన్ని శాసిస్తూ పాలన సాగించాడు. కానీ ప్రస్తుతం పరిస్థితి అంతా తారుమారైంది.

● రివర్స్ గేర్‌తో.. దిక్కుతోచని బుగ్గన:

ఐదేళ్లపాటు ఆర్థిక మంత్రిగా బుగ్గన డోన్ నియోజకవర్గంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించారు. తాను ఏమి చెబితే.. అది జరిగి తీరాల్సిందేనన్న శాసనంతో పాలన సాగించారు. వైసీపీలో నాయకులు, కార్యకర్తలంతా కూడా బుగ్గన కనుసన్నల్లో నడుచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అయితే.. ఎన్నికల కోడ్ రాగానే ఒక్కసారిగా డోన్ నియోజకవర్గ వైసీపీలో పరిస్థితులు మారిపోయాయి. మంత్రి బుగ్గన తీరుపై పలువురు పార్టీ నాయకులు తిరుగుబాట్లు చేశారు. వైసీపీకి గుడ్‌బై చెప్పి పలువురు నాయకులు టీడీపీలో చేరిపోయారు. పార్టీ నాయకుల రివర్స్ గేర్‌తో బుగ్గన ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

● ప్రచారాలకు దూరం.. దూరం

ఎన్నికల షెడ్యూల్ వెలువడే రోజు వరకు మంత్రి బుగ్గన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల కోడ్ ఎప్పుడైతే వచ్చిందో.. బుగ్గన అధికార హవా ఒక్కసారిగా తారు మారైంది. మంత్రి బుగ్గన ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. వైసీపీ కార్యాలయంలోనే ఆత్మీయ సమావేశం నిర్వహించి అదే ప్రచారంగా చేస్తున్నారు. డోన్; ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో కేవలం ఆత్మీయ సమావేశాలకే పరిమితమై బుగ్గన ఓట్లను అడిగే ఫార్ములాను అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం డోన్‌లో ఓ వార్డులో పర్యటించి తూతూ మంత్రంగా ప్రచారం నిర్వహించారు. నేరుగా ప్రజల్లోకి వెళితే.. ఎలాంటి సమస్యలు ఎదురవుతాయోనన్న భయంతోనే మంత్రి బుగ్గన కార్యాలయంలోనే ఆత్మీయ సమావేశాలతో ప్రచారం చేస్తున్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

● మంత్రిని కలిసేందుకు నో ఎంట్రీ..!

డోన్ నియోజకవర్గంలో ప్రజలు తమసమస్యలు చెప్పుకునేందుకు మంత్రి బుగ్గన కలవాలంటే నో ఎంట్రీ అన్నట్లుగా వ్యవహరించారు. ఈ ఐదేళ్ల కాలంలో ప్రజలు నేరుగా మంత్రిని కలుసుకున్న దాఖలాలు ఎప్పుడూ లేదన్నది చర్చ సాగుతోంది. ఎక్కువ సమయం మంత్రి బుగ్గన అమరావతి, ఢిల్లీ పర్యటనలతోనే గడిపారు. నియోజకవర్గంలో మంత్రి బుగ్గన పర్యటించినా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకే పరిమితమయ్యారు. దీంతో ప్రజలు నేరుగా మంత్రిని కలిసి తమ సమస్యలు చెప్పుకునే వీల్లేకుండా పోయిందని సాకు వినిపిస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం జగన్ ఎంతో ఆర్భాటంగా చేపట్టినా డోన్ నియోజకవర్గంలో ఆ కార్యక్రమాన్ని మంత్రి బుగ్గన స్థానిక నాయకులకే పరిమితం చేశారు. అందుకోసమే ప్రస్తుతం ఎన్నికల సమయంలో కూడా ప్రచారాలకు మంత్రి బుగ్గన దూరంగా ఉన్నారన్నది రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఓటరు నాడి

చాగలమర్రి, ఏప్రిల్ 25:

సమర్థుడైన పాలకుడికే ఓటు వేస్తా



ఓటు అనే ఆయుధం రాష్ట్ర ప్రజల తలరాతలు మార్చేలా ఉండాలి. అవినీతికి దూరంగా ఉండే సమర్థమైన నాయకుడికి నా ఓటు వేస్తా. ఈ సారి ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసే అవకాశ వచ్చింది. ఓటు వేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ సారి ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలి. మంచి ఆలోచన ఉన్న వారు గెలిస్తే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుంది.

- కమాల్‌బీ, యువతి, చాగలమర్రి

రైతులను ఆదుకోవాలి



ఎన్నికల్లో రైతులకు ఆశ చూపిస్తారు. ఎన్నికలు ముగిసిన తరువాత చుక్కలు చూపించడం పరిపాటిగా మారింది. రైతు ప్రభుత్వంగా చెప్పుకొని విస్మరించడం తగదు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేయాలి. భవిష్యత్తులో ఆహార సంక్షోభం రాకుండా ఉండాలంటే రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. రైతుల సంక్షేమం కోసం పాటుపడే నాయకుడికే ఓటు వేస్తా.

- ఖాదర్‌వలి, రైతు, చాగలమర్రి

పింఛన్ నిలిపి అన్యాయం చేశారు



వైసీపీ పాలనలో పింఛన్ నిలిపి అన్యాయం చేశారు. 15 ఏళ్ల నుంచి దివ్యాంగుల పింఛన్ ప్రభుత్వం ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూడేళ్ల నుంచి పింఛన్ నిలిపి వేశారు. మేము మనుగడ సాగించాలంటే రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి. దివ్యాంగులకు మేలు చేసే పార్టీకే ఓటు వేస్తా.

-షేక్.అమిరూన్, దివ్యాంగురాలు, చాగలమర్రి

ఉపాధి కల్పించే వారికే ఓటు



చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పార్టీకే ఓటు వేస్తా. ఉద్యోగాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వెళ్తోంది. రాష్ట్రంలోనే చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నేతలు కృషి చేయాలి. ప్రజల సమస్యలు పరిష్కరించే నాయకుడికే ఓటు వేస్తా. ఉత్తమ నాయకులను ఎన్నుకునేందుకు ప్రలోభాలకు గురి కాకూడదు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలి.

- ఉసేన్‌బాషా, డిగ్రీ, చాగలమర్రి

ఎన్నికల గుర్తుల చరిత్ర ఇది..!



ఆత్మకూరు, ఏప్రిల్ 25: భారతదేశంలో 1952లో జరిగిన తొలి ఎన్నికల సమయానికి అక్షరాస్యత 16శాతమే ఉండేది. దీంతో ఓటర్లు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గుర్తించడం కష్టతరం కాబట్టి అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు వీలుగా బ్యాలెట్ పత్రంలో గుర్తులను ఉంచాలని నిర్ణయించారు. ఇందుకుగాను 1950లో ప్రముఖ చిత్రకారుడు ఎంఎస్ సేథితో పెన్సిల్ ద్వారా పలు చిత్రాలను గీయించి వాటిలో పలు గుర్తులను ఎన్నికల బ్యాలెట్ పత్రంలో ఉపయోగించుకున్నారు. అలా నేటికీ పలు రకాలుగా ఆధునికతను సంతరించుకుని ఎన్నికల గుర్తులు రూపొందాయి. కాగా ఎంఎస్ సేథి 2000 సంవత్సరంలో కన్నుమూశారు. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తించబడిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు వారు ఎంచుకున్న గుర్తులను కేటాయించేవారు. ఆయా రాజకీయ పార్టీల తరుపున బీ-ఫామ్ సమర్పించి పోటీ చేసే వారికి ఆ పార్టీ గుర్తులను కేటాయించారు. అయితే ఈవీఎంలు వచ్చాక గుర్తులతో పాటు అభ్యర్థి పేరు, ఫొటోతోపాటు కేటాయించిన గుర్తును అందుబాటులో ఉంచారు.

కర్నూలు అసెంబ్లీకి 56 నామినేషన్లు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి చివరి రోజు 21 నామినేషన్లను ఆర్‌ఓ స్వీకరించారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఏ.భార్గవతేజ తన చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించారు. ఇప్పటి వరకు కర్నూలు అసెంబ్లీకి 56 నామినేషన్లు వచ్చాయి.

1989లో తొలి బహిరంగ సభ

నంద్యాలకు వచ్చిన రాజీవ్‌గాంధీ..

జ్ఞాపకం




ప్రసంగిస్తున్న రాజీవ్‌గాంధీ, అనువదిస్తున్న మర్రి చెన్నారెడ్డి (ఫైల్)

నంద్యాల టౌన్, ఏప్రిల్ 25 : 1989లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న వేళ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార పర్వాన్ని ప్రారంభించిన సమయంలో.. తొలి బహిరంగ సభను నంద్యాలలో ఏర్పాటు చేశారు. బొమ్మలసత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హాజరై ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. నంద్యాల సభలో రాజీవ్‌గాంధీ ప్రసంగించగా వేదికపై ముగ్గురు ఉద్దండులకు మాత్రమే అవకాశం దక్కింది. రాజీవ్‌గాంధీ ప్రసంగిస్తుండగా ఆయన హిందీ ప్రసంగాన్ని మర్రి చెన్నారెడ్డి అనువదించారు. వేదికపై వేసిన కుర్చీలో కూర్చున్న వ్యక్తి కర్నూలు జిల్లా పెద్దాయనగా రాష్ట్ర, కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీలో చక్రం తిప్పిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి. బొజ్జా వెంకటరెడ్డి(నంద్యాల మాజీ ఎంపీ) కూడా జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి హోదాలో రాజీవ్‌గాంధీ ఎన్నికల సభలో వేదికపై అవకాశం దక్కించుకున్నారు.

ఎన్నికల హామీ.. ఎత్తేశారు..

- రాయల్టీ చెక్ పోస్టు ఎత్తేస్తామని వైసీపీ హామీ
- అధికారంలోకి వచ్చాక ఆ దిశగా ఆలోచించని వైనం
- హామీని విస్మరించి అదనపు పన్నులతో పరిశ్రమపై భారం





అట్లుంటది అన్నతోని..

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 25: ఎన్నికల ముందు ఆర్భాటంగా వివిధ వర్గాలకు హామీలు గుప్పించడం ఎన్నికలయ్యాక వాటిని గాలికి వదిలేయడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది. ముఖ్యంగా బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాళ్ల పరిశ్రమకు గుది బండగా మారిన రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తివేస్తామని 2019 ఎన్నికల్లో కీలక హామీ ఇచ్చిన వైసీపీ నేతలు అధికారంలోకి వచ్చాక ఆ హామీని పూర్తిగా విస్మరించారు. హామీని విస్మరించడంతోపాటు తెలుగుదేశం పార్టీలో సవ్యంగా సాగిన కుటీర పరిశ్రమ లాంటి నాపరాళ్ల పరిశ్రపై అదనపు పన్నులతో భారం మోపి పరిశ్రమను పీకల్లోతు కష్టాల్లో ముంచారు. దీంతో వైసీపీ ప్రభుత్వం, ఆపార్టీ నేతల తీరుపై నాపరాళ్ల పరిశ్రమ వర్గాలు మండి పడుతున్నాయి. నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె వద్ద, అనంతపురం జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన రాయల్టీ చెక్‌పోస్టును వైసీపీ అధికారంలోకి రాగానే ఎత్తివేస్తామని 2019 ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. ఆ మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. కాటసానితోపాటు అప్పుడు వైసీపీ కోసం పని చేసిన దివంగత నేతలు చల్లా రామకిష్టారెడ్డి, ఎర్రబోతుల వెంకటరెడ్డి కలిసి బనగానపల్లె నియోజకవర్గంలో ఊరు వాడ తిరిగి రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తి వేస్తామన్న హామీని బలంగా గుప్పించారు. ఇది నిజమని నమ్మిన నాపరాళ్ల పరిశమ యజమానులు, కార్మికులు 2019 ఎన్నికల్లో గంప గుత్తుగా వైసీపీకి ఓటు వేశారు. అయితే ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదిశగా కనీస ప్రయత్నమే చేయకపోవడాన్ని నియోజకవర్గ ప్రజలు తప్పు పడుతున్నారు. నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలంతో పాటు, అవుకు, బనగానపల్లె మండలాల్లో వేలాది మంది ప్రజలు నాపరాళ్ల పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడ లభించే నాపరాళ్లు అత్యధికంగా తాడిప్రతి పాలిషింగ్ యూనిట్లకు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు తరలివెళతాయి. అయితే బార్డర్ దాటాలంటే రాయల్టీ చెక్‌పోస్టు వద్ద 5 టన్నులకు రూ490 రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ట్రాక్టర్లు, లారీలకు టన్నేజీని బట్టి వేలాది రూపాయలు రాయల్టీ చెల్లించాల్సి ఉంది. తీవ్ర నష్టాల్లో ఉన్న నాపరాళ్ల పరిశ్రమకు రాయల్టీ చెల్లించడం భారంగా మారింది. ఈ స్థితిలో రాయల్టీ చెక్‌పోస్టును ఎత్తివేసి నాపరాళ్లను ఫ్రీగా తరలించుకునేలా చేస్తామన్న వైసీపీ నేతల హామీ పరిశ్రమ వర్గాలకు ఊరట కలిగించింది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కాటసానిని హామీని విస్మరించడంతో పరిశ్రమ వర్గాలు మండిపడుతున్నాయి. రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తివేయకపోగా, చిరు పరిశ్రమ అయిన నాపరాళ్ల పరిశ్రమపై వైసీపీ ప్రభుత్వం మరిన్ని అదనపు భారాలు మోపింది. ఏడీఆర్ (అడ్వాన్స్‌డ్ డెడ్ రెంట్) 1 హెక్టారుకు రూ.52వేలు ఉండగా దీనికి ప్రీమియం అమౌంట్ కింద 10రెట్లు రూ.5.20లక్షలు చెల్లించాలని నిబంధన తీసుకవచ్చారు. అదేవిధంగా ఎస్‌డీ(సెక్యూరిటీ డిపాజిట్) మూడు రేట్లు రూ.1.56లక్షలు చెల్లించేలా నిబంధన తీసుకరావడంతో నాపరాళ్ల పరిశ్రమ నిలిచిపోయో పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా ఆయా వర్గాల్లో వైసీపీ నేతలు, ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది.

చంద్రబాబు హామీతో పరిశ్రమ వర్గాలకు ఊరట

ఇదిలా వుండగా ఇటీవల బనగానపల్లెలో పర్యటించిన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబు నాపరాళ్ల పరిశమపై భారాలు తగ్గించి, పరిశ్రమకు పూర్వ వైభవం తెప్పిస్తామని హామీ ఇవ్వడం ఆ వర్గాలకు ఊరట కలిగించింది. చిన్న పరిశ్రమల పట్ల తమ పార్టీ పెద్ద మనస్సుతో ఆలోచిస్తుందని, నాపరాళ్ల పరిశ్రమకు అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో టీడీపీ అధికారంలోకి వస్తే నాపరాళ్ల పరిశ్రమకు మంచి రోజులు వస్తాయన్న ఆశాభావం ఏర్పడింది.



ఆకలి తీర్చే అన్నపూర్ణమ్మనవుతా..



కోట్ల సుజాతమ్మ రొట్టెలు కాలుస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు. నిత్యం జనంలో ఉంటూ ఆమె ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే ఆమె ఒక్కసారిగా సాధారణ మహిళగా మారిపోయి రొట్టెలు తట్టి కట్టెల పొయ్యి మీద వేసి కాల్చారు. గురువారం డోన్ మండలంలోని కామగాని గుంట్ల గ్రామంలో టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓ ఇంటి వద్ద మహిళ కట్టెల పొయ్యి మీద రొట్టెలు కాలుస్తుండగా.. కోట్ల సుజాతమ్మ వెళ్లి పలకరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఆ మహిళకు తెలియజేశారు. అనంతరం ఆ మహిళ స్థానంలో కూర్చుని కట్టెల పొయ్యిపై రొట్టెలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. కోట్ల సుజాతమ్మ రొట్టెలు చేస్తుండగా అక్కడున్న మహిళలంతా ఆమె వైపే చూస్తుండిపోయారు.

- డోన్, ఏప్రిల్ 25



ఎండిపోయిన నది నుంచి అరకొరగా ఉన్న నీటిని పొలాలకు వాడుకుంటున్న రైతులు

వైసీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో ఆర్డీఎస్ ఊసే ఎత్తలేదు. దీంతో మూడు నియోజకవర్గాల్లోని రైతుల ఆశలు అడియాశలయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1986 కోట్లు మంజూరు చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఐదేళ్లలో పైసా నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు మధ్యలోనే పనులు నిలిపివేశారు. దీంతో రైతులు ఆశలు నీరుగారాయి.

ఆర్డీఎస్ ఊసే లేదా?

- గత ఎన్నికల్లో ఎమ్మెల్యే హామీలు గాలికే..
- చంద్రబాబు హయాంలో రూ.1986 కోట్ల ఆర్డీఎస్ పనులకు నిధులు మంజూరు
- పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం
- బీళ్లుగా మారిన భూములు



ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తయిన సుయిస్ పనులు

మంత్రాలయం, ఏప్రిల్ 25: మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన ఆర్డీఎస్ కుడి కాలువ ఊసే ఎవ్వరికీ పట్టలేదు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆర్డీఎస్ పనులు పూర్తి చేసి తాగు, సాగునీరు అందిస్తానని ఇచ్చిన హామీని మర్చిపోయారు. దీంతో మూడు నియోజకవర్గాల్లోని రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పది ఎకరాలు ఉన్న రైతు కూడా పంటలు పండక వలసబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం చంద్రబాబు పశ్చిమ కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో 2019 ఫిబ్రవరిలో మధ్యతరహా నీటి పారుదల శాఖ ద్వారా రూ.1986 కోట్లు మంజూరు చేశారు. నేషనల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు చేపట్టి ఆర్డీఎస్ కుడి కాలువ నాలుగు స్లూయిస్‌లు, హెడ్ రెగ్యులేటర్ల పనులు చేపట్టారు. దాదాపు రూ.5 కోట్లు ఖర్చు చేస్తే.. వైసీపీ అధికారంలోకి రాగానే ఐదేళ్లలో పైసా నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు మధ్యలోనే పనులు నిలిపివేశారు. ఆర్డీఎస్ కుడి కాలువను 160 కి.మీ. నిర్మించాల్సి ఉండగా దాదాపు 40 ఎకరాల్లో భూసేకరణ పనులు పూర్తయ్యాయి. తుంగభద్ర నది నుంచి 4 టీఎంసీలు డైవర్షన్ చేసి మంత్రాలయం ఎమ్మిగనూరు, గోనెగండ్ల గూడూరు, బెళగల్ తదితర మండలాల్లోని లక్షలాది ఎకరాలకు తాగు, సాగునీరు అందించే ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. రైతన్నల నోట్లో వైసీపీ ప్రభుత్వం మట్టి కొట్టింది. అరకొర భూగర్భజలాలను బోర్ల ద్వారా పది రోజులకొకసారి సరఫరా చేసి పల్లెలు గొంతు తడుపుతున్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తేనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తవుతుందని ఆ మూడు నియోజకవర్గాల ప్రజలు పేర్కొంటున్నారు.



పనులను వైసీపీ నిర్లక్ష్యం చేసింది

చంద్రబాబు హయాంలో ఆర్డీఎస్ కుడి కాలువ పనులకు నిధులు విడుదల చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఈ కాల్వ పనులను నిర్లక్ష్యం చేసింది. దీంతో తుంగభద్ర నదిలో నీరు లేక పంటలు ఎండిపోయి, ఈ ఏడాది అప్పులకు వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఉన్నాం.

- బోయ రంగస్వామి, సాతనూరు, కోసిగి మండలం



నిర్మాణ మధ్యలో ఉన్న హెడ్ రెగ్యులేటర్



● రైతులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది

ఐదేళ్లలో రైతులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. ఆర్డీఎస్ కుడి కాలువ పనులు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేస్తే.. వైసీపీ ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వకుండా మోసం చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే.. తాగునీరు, సాగు నీరు మాకు అందుతుంది.

- లక్ష్మీకాంతరెడ్డి, రైతు, దొడ్డిమేకల గ్రామం, పెద్దకడుబూరు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాల ఏర్పాటు



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌పై ఎన్నికల యంత్రాంగం వేగం పెంచింది. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుల సమయం కూడా పూర్తి కావడంతో ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా మే 5 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలను అధికారులు నిర్ణయించారు.

నియోజకవర్గం		పోలింగ్ కేంద్రం
కర్నూలు	:	ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హై స్కూల్
పాణ్యం	:	ప్రభుత్వ బాలుర హైస్కూల్, బీక్యాంపు,
కోడుమూరు	:	ప్రభుత్వ టౌన్ మోడల్ స్కూల్, కోట్ల సర్కిల్
ఎమ్మిగనూరు	:	ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్
మంత్రాలయం	:	జడ్పీహెచ్ పాఠశాల
ఆదోని	:	నెహ్రూ మెమోరియల్ హైస్కూల్
ఆలూరు	:	ప్రభుత్వ బాలుర హైస్కూల్-2, అంబేడ్కర్ సర్కిల్
పత్తికొండ	:	ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఆదర్శమూర్తులు

- దేశానికే స్ఫూర్తిగా నిలిచిన ఓర్వకల్లు పొదుపు మహిళలు
- 1998లో చంద్రబాబు నాయుడు హయాంలో డ్వాక్రా సంఘాల ఏర్పాటు
- మండలంలో 980 సంఘాలు, 10,500 మంది సంఘం సభ్యులు



ఓర్వకల్లు, ఏప్రిల్ 25: సమాజానికి పట్టిన రుగ్మతలు తొలగాలంటే స్వచ్ఛ పాలకులు అవసరం. అలాంటి వారిని ఎన్నుకోవడం ఓటర్ల బాధ్యత. ప్రతి ఒక్కరూ చైతన్యంతో వ్యవహరిస్తేనే వ్యవస్థ సరైన మార్గంలో నడుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అలాంటి చైతన్యవంతమైన పాత్రను ఓర్వకల్లు పొదుపు మహిళలు పోషిస్తున్నారు. స్వయం ఉపాధితో వారు సాధిస్తున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. 1998లో నాటి టీడీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ప్రారంభించారు. అయితే.. ఓర్వకల్లు మండలంలో 980 సంఘాలు ఉన్నాయి. 10,500 మంది సంఘం సభ్యులు ఉన్నారు. అయితే.. చంద్రబాబు ఏర్పాటు చేసిన పొదుపు సంఘాలతో ఓర్వకల్లు మహిళలు దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అయితే.. ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడ కూడా సంఘాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. పొదుపు సంఘాల మహిళలు ఓటర్ల చైతన్య కరదీపికలుగా నిలిచారు. అలాగే మహిళలకు తోడుగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుంటారు. ఐదేళ్లకోసారి వచ్చే ఓటర్ల పండుగ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు వజ్రాయుధం. పాణ్యం నియోజకవర్గ మహిళా ఓటర్లు చైతన్యంతో తమ తలరాతలను తామే మార్చుకున్న వీరవనితలు. కుటుంబాలను సుమున్నతంగా తీర్చిదిద్దుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆదర్శమూర్తులు. అలాగే పొదుపు సంఘాల మహిళలు ఓటర్లపై అవగాహన ఎంతగానో కలిగి ఉంది. మే 13న జరిగే ఎన్నికల్లో ఓర్వకల్లు పొదుపు మహిళలు ముఖ్యంగా నిలుస్తున్నారు.

● పొదుపు సంఘాల స్ఫూర్తి చంద్రబాబే:

1998లో ప్రారంభించిన డ్వాక్రా సంఘాల నేపథ్యంలో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఓర్వకల్లు మండల ఐక్య సంఘాన్ని సందర్శించారు. పొదుపు మహిళలతో ముఖాముఖి చర్చ జరిగింది. అప్పట్లోనే పొదుపు సంఘాల మహిళలు దినదినాభివృద్ధి చెంది ఆదర్శంగా నిలిచారు. ఇక్కడి పొదుపు మహిళలు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు వెళ్లి అక్కడి మహిళలను పొదుపు సంఘాలుగా ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. ఓర్వకల్లు మహిళలు ఆదర్శంగా నిలవడానికి కారణం చంద్రబాబే అని పొదుపు మహిళలు గర్వించుకుంటున్నారు.

● ప్రజల ఆకాంక్షలను గౌరవించాలి



చట్టసభలకు ఎన్నికయ్యే అభ్యర్థులు ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ అందుకు అనుగుణంగా పని చేయాలి. జనాకర్షక పథకాలకే కాకుండా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ల్యాండ్ మార్క్‌గా ఉండే ప్రాజెక్టులు నిర్మిస్తే.. రాష్ట్రానికి అభివృద్ధి సూచికలుగా మారుతాయి. చట్టాలపై అవగాహన ఉండి చట్ట సభల్లో చురుగ్గా వ్యవహరిస్తూ భవిష్యత్ తరాలకు భరోసా కల్పించే పథకాలు రూపొందించాలి. అలాంటి వారికి ఓటు వేయాలి.

- సూర్య నారాయణ రెడ్డి, విశ్రాంతి ఉద్యోగి, ఓర్వకల్లు



● ప్రలోభాలతో జాగ్రత్త

ఓటర్లను ప్రలోభ పెట్టి గెలవాలనుకునే వారిని ఓడించాలి. ఇలాంటివారు గెలిస్తే.. సంపాదనపైనే దృష్టి పెడతారు. ఓటరు బాధ్యతగా వ్యవహరిస్తే రాష్ట్ర భవిష్యత్తును మార్చే ప్రభుత్వం సాధ్యం. అభివృద్ధి, ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తే.. నేతలను ఎన్నుకుంటే రాష్ట్రానికి, దేశానికి మేలు జరుగుతుంది. ఈ దిశగా ఓటర్లు ఆలోచించాలి.

- పుష్పరాజు, విశ్రాంతి ఉద్యోగి, ఓర్వకల్లు

నాడు సారా.. నేడు టెట్రా..!

● ఎన్నికల వేళ మద్యానికి డిమాండ్



'పొరుగు' మందు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 25: ఎన్నికలు వస్తే చాలు కుప్పలు..తెప్పలుగా సారా పాకెట్లు తెచ్చి మందుబాబులకు పంచేవారు. పదేళ్ల క్రితం సారా ప్యాకెట్ ఒక్కోటి రూ.10 లోపు ఉండేది. ఓటింగ్‌కు కొన్ని రోజుల ముందుగానే అభ్యర్థులు వాటిని తెప్పించి డంప్ చేసుకునే వారు. పోలింగ్ ముందు రోజు లేదా పోలింగ్ రోజు వాటిని ఓటర్లకు పంచేవారు. ఈ క్రమంలో ఆంధ్ర ప్రాంతంలో ఎన్నికలు జరుగుతున్నాయంటే కర్ణాటక మద్యానికి మంచి డిమాండ్ ఉండేది. సరిహద్దు ప్రాంతాలైన కర్నూలు, మంత్రాలయం, ఆలూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో ముందుగానే సారా ప్యాకెట్లు తెప్పించే వారు. అయితే మన రాష్ట్రంలో సారాను నిషేధించడంతో వాటి స్థానంలో ప్రస్తుతం టెట్రా ప్యాకెట్లు వస్తున్నాయి. కర్ణాటక నుంచి నేరుగా, లేదా తెలంగాణలోని కొన్ని ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో టెట్రా ప్యాకెట్లు తెప్పించుకుంటున్నారు. ఇక్కడి మద్యం ధరలకు కంటే కర్ణాటక టెట్రా ప్యాకెట్ల ధరలు తక్కువగా ఉండటమే డిమాండ్‌కు ప్రధాన కారణం. ర్యాలీలు, ఊరేగింపులు. సభలు, సమావేశాల్లో టెట్రా ప్యాకెట్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి.

మద్దతు మీకే.. మాకేం ఇస్తారు...?

● సామాజిక వర్గం నేతల డిమాండ్లతో అభ్యర్థుల బేజారు



నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 25: సామాజిక వర్గం నేతల డిమాండ్లతో అభ్యర్థుల బేజారెత్తిపోతున్నారు. తమ వర్గం ఓట్లు వేయించాలంటే ఎంత ఇస్తారంటూ బేరసారాలకు దిగుతున్నారు. దీంతో ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి రూ.5 నుంచి రూ.10 లక్షలతో పాటు అన్ని ఖర్చులు పెట్టుకోవాలంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. వార్డుల వారీగా చేరికల పేరుతో అభ్యర్థుల వద్ద నుంచి నగదు డిమాండ్ చేస్తున్నారు. ఒప్పుకోకుంటే తమకు గౌరవం ఇవ్వటం లేదని బురద చల్లటం ఆనవాయితీగా మారింది. వీరికి డబ్బులు ఇస్తే ఓట్లు వేయించగలరా లేదా అని అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. ఓట్లు రాలతాయి అనుకుంటే మొదట కొంత మొత్తం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

పోస్టల్ బ్యాలెట్ల దరఖాస్తులు 17,352

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: కర్నూలు జిల్లా వ్యాప్తంగా 8 నియోజకవర్గాల నుంచి పోస్టల్ బ్యాలెట్లకు 17,352 దరఖాస్తులు వచ్చాయి. ఫారం-12కి 15,063 దరఖాస్తులు రాగా, ఫారం-12డికి 1,024, అత్యవసర సేవల కింద (ఫారం-12డి) 1,265, మొత్తం 17,352 దరఖాస్తులు వచ్చినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల వివరాలు..

నియోజకవర్గం	ఫారం-12	ఫారం-12డి (అత్యవసర సేవలు)		మొత్తం
కర్నూలు	2883	53	174	3110
కోడుమూరు	2204	151	206	2561
పత్తికొండ	1094	118	99	1311
ఆలూరు	800	228	72	1100
ఆదోని	1544	63	241	1848
ఎమ్మిగనూరు	2128	171	110	2409
మంత్రాలయం	345	81	44	470
పాణ్యం	4543	159	319	4543
మొత్తం	15063	1024	1265	17352

సమర శంఖం



నామినేషన్ నాదం మోగింది..!

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ సమర శంఖం పూరించారు. నామినేషన్ వేసేందుకు గురువారం కొండారెడ్డి బురుజు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో అభిమానుల సందడి చూసిన భరత్ రెట్టింపు ఉత్సాహంతో వాహనంపై నిలబడి శంఖం ఊదారు. ఈ సందర్భంగా నగరంలో టీడీపీ శ్రేణుల కోలాహలం కనిపించింది.

- కర్నూలు అర్బన్



జెండా కట్టెలతో ఉపాధి

సార్వత్రిక ఎన్నికల్లో మేదరులకు ఫుల్ డిమాండ్ ఉంది. ఆయా రాజకీయ పార్టీల నాయకులు జెండా కట్టెల కోసం మేదరుల వద్దకు క్యూ కడుతున్నారు. రోజుకు వందలాది జెండాలు కడుతున్నామని కోసిగికి చెందిన మేదరి గోరంట్ల తెలిపాడు. ఒక్కో పార్టీకి వేల జెండా కట్టెలు కట్టి పార్టీల నాయకులకు అందించామని, ఈ ఎన్నికల్లో ఫుల్ బిజీ అయ్యామని చెప్పాడు.

- కోసిగి

బీసీకి జన'హారతి'

ఎన్నికల వేళ రాజకీయ నాయకులు అనునిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. అభిమాన నాయకులు వస్తే పల్లెల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో ప్రచారం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డికి గురువారం రాత్రి మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. కొండపేటలో ప్రచారం చేస్తున్న మహిళలు బీసీపై అభిమానంతో వీధి వీధినా హారతులతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటారు.

- బనగానపల్లె



ప్రతి విద్యార్థికి ఏకాగ్రత ఉండాలి: వీసీ

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 25: ప్రతి విద్యార్థికి చదువు మీద ఏకాగ్రత ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం యూనివర్సిటీ సెనేట్ హాల్లో ఉన్నత విద్యారంగంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఉపాధి అవకాశాలపై అవగాహన ఉండాలన్నారు. అందుకు సహకరించే విధంగా వర్సిటీలో పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు పలు కార్యక్ర మాలు నిర్వహి స్తున్నట్లు వివరించారు. అధ్యాపకులు కూడా ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ విద్యార్థులకు సరైన మార్గ నిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంటర్ ఆఫ్ రీసేర్చ్ స్కీమ్స్ అండ్ పాలసీస్ కన్సల్టెంట్ నగేష్‌బాబు విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ అవకాశాలను గురించి వివరిం చారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు.

రెండు లారీలు సీజ్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 25: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు గనుల శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఒంగోలు నుంచి చెన్నైకి అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని సీజ్ చేసి ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ తరలించామన్నారు. అలాగే తమరాజ్‌పల్లె నుంచి రోడ్డు మెటల్ తరలిస్తున్న మరో టిప్పర్‌ను కూడా సీజ్ చేసి పాణ్యం పోలీస్‌స్టేషన్ తరలించామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ జెండాను ఎగురవేస్తాం

సి.బెళగల్, ఏప్రిల్ 25: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేస్తామని టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటప్ప అన్నారు. గురువారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో వెంకటప్ప అధ్వర్యంలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటప్ప మాట్లాడుతూ జగన్‌కు జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. ఈ. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామాంజినేయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా టీజీ భరత్ నామినేషన్

● వేలాది మంది కార్యకర్తలతో భారీ ఊరేగింపు
● కదంతొక్కిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు






కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 25: తెలుగుదేశం పార్టీ కర్నూలు నియోజకవర్గం అభ్యర్థిగా టీజీ భరత్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం టీజీ భరత్ వేలాది మంది కార్యకర్తలతో ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వరకు తరలివెళ్లారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు ప్రజల స్పందన తన విజయా నికి సంకేతమని అన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్ల కాలంలో అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అన్ని గమనిం చిన ప్రజలు ఈసారి టీడీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

● ఉత్సాహ పరిచిన కళాకారులు.. టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మి పద్మచౌదరి, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాటలు పాడుతూ జై తెలుగుదేశం నినాదాలు చేస్తూ ర్యాలీలో ఓటర్లను ఉత్సాహపరిచారు. టీజీ భరత్‌ను గెలిపించాలని కళాకారులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పాటలు, డైలాంగులు, చెబుతూ ఓటర్లను ఆకట్టు కున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి అయితేనే ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని సందేశమిచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం అధ్యక్షుడు ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

టీజీ భరత్ ర్యాలీ, నామినేషన్ సాగిందిలా..

టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగురాజు, జనసేన ఇన్‌చార్జి అర్షద్, బీజేపీ కన్వీనర్ సూర్యప్రకాష్, లోక్‌సత్తా పార్టీ నేత బ్రహ్మేశ్వర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు రెడ్డి పోగు భాస్కర్ మాదిగా, టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నంద్యాల నాగేంద్ర, కల్కూరు చంద్రశేఖర్‌తో కలిసి టీజీ భరత్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అంతక ముందు పెద్ద మార్కెట్ నుంచి తన తండ్రి టీజీ వెంకటేష్‌తోపాటు తనయుడు టీజీ విభూ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి అంబేడ్కర్ కూడలి, కొండారెడ్డి బురుజు, జిల్లా కోర్టు, కొత్త పేట నాలుగురోడ్ల కూడలి, శ్రీలక్ష్మీస్కూల్ మున్సిపల్ ఆఫీసు వరకు వేలాది మందితో ర్యాలీ కొనసాగింది. నాయకులు, అభిమానులు ప్రధాన కూడళ్ల వద్ద గజమాలలు వేసి, టెంకాయలను కొట్టి టీజీ భరత్‌కు ఘన స్వాగతం పలికారు. ఎండను సైతం లెక్క చేయకుండా మహిళలు ర్యాలీలో పాల్గొని టీజీ భరత్‌కు మద్దతు పలికారు. బీజేపీ నాయకులు వెంకటేష్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, టీజీ అభిమానులు, పాల్గొన్నారు.

ఘనంగా కోన వెంకటేశ్వరస్వామి వసంతోత్సవం

సి.బెళగల్, ఏప్రిల్ 25: మండలంలోని క్రిష్ణదొడ్డిలో కోన వెంకటేశ్వరస్వామి వసంతోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని కొండపై నుంచి పల్లకిలో ఊరేగిస్తూ కిందకు తీసుకొచ్చారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరుగురు వలంటీర్ల రాజీనామా

గూడూరు, ఏప్రిల్ 25: గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామ సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు వలంటీర్లు గురువారం గూడూరు మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో జయశ్రీకి రాజీనామా పత్రాలను సమర్పిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్ల రాజీనామా పత్రాలను జడ్పీ సీఈవోకు సమర్పిస్తామన్నారు.

అంగన్‌వాడీలు పనితీరు మార్చుకోవాలి

సి.బెళగల్, ఏప్రిల్ 25: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కరు తమ పని తీరు మార్చుకోవాలని సూపర్‌వైజర్ పద్మవతమ్మ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

పెంచికలపాడులో గడ్డివాము దగ్ధం

గూడూరు, ఏప్రిల్ 25: మండలంలోని పెంచికలపాడు గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం పెంచికలపాడులోని కురువ పెద్ద రంగయ్యకు చెందిన కల్లందొడ్డిలో గడ్డి వాము కు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు చేలరేగాయి. ఇది గమ నించిన బాధితుడు, స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డివాము అగ్నికి ఆహుతి అయింది. దాదాపు లక్ష రూపాయలు నష్టం వాటిల్లి నట్లు గ్రామస్థులు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 25: నాటుసారా, బెల్టుషాపులపై విస్తృతంగా దాడులు నిర్వహించామని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం నగరంలోని బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 3700 లీటర్ల నాటు సారా తయారికి ఉపయోగించే బెల్లం ఊట, 70 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసి, నీలి షికారి రాజమ్మ అనే మహిళ వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను, బి.వెంకటమ్మ అనే మహిళ నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద గిరమ్మ అనే మహిళ వద్ద నుంచి 21 మద్యం బాటిళ్లు, ఈ తాండ్రపాడుకు చెందిన బీ.పెద్దస్వామి నుంచి 29 బాటిళ్లు, సీ. సాయికుమార్ నుంచి 48 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో కర్నూ లు డీటీఎఫ్ సీఐ ఈ.నరసానాయుడు, ఎస్ఐ సీ.రెహనాబేగం, జీ. మారుతీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు పరాభవం తప్పదు



33, 36వ వార్డుల ఎన్నికల ప్రచారంలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరుచరిత

కల్లూరు, ఏప్రిల్ 25: పాణ్యం నియోజకవర్గంలో ఫ్యాన్‌కు పరాభవం తప్పదని టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 33వ వార్డు పాతకల్లూరు, 36వ వార్డు అయ్యవారి నాగలా పురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లా డుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, 36వ వార్డు ఇన్‌చార్జి ఆర్.తిరుమలేశ్వ రరెడ్డి, ఆర్.లోకేశ్వరరెడ్డి, పెద్దబీచుపల్లి, నాగసుబ్బారెడ్డి, మద్దీశ్వర్‌రెడ్డి, వేదాం తొరెడ్డి, 33వ వార్డు నాయకులు ఎన్‌వీ.రామకృష్ణ, ఎస్.ఫిరోజ్, పవన్‌కుమార్, సంపతి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిన డాక్టర్ కావ్య: పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత సమక్షంలో కల్లూరు అర్బన్ 41వ వార్డుకు చెందిన గైనకాలజిస్టు డాక్టర్ కావ్యతో పాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి గౌరు చరిత టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విదానాలు నచ్చక టీడీపీలో చేరిన ట్లు వారు తెలిపారు. కార్యక్ర మంలో నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

● ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మర్రికుంట గోపాల్‌రెడ్డితోపాటు 10 కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి ఉన్నారు.

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిన డాక్టర్ కావ్య

● **టీడీపీకి కర్నూలు టూ వీలర్ మెకానిక్ వేల్ఫేర్ అసోసియేషన్ మద్దతు:** గౌరు చరితకు కర్నూలు టూ వీలర్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. సోమవారం మాధవీనగర్‌లోని నివాసంలో గౌరు చరితను కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టిం చుకోలేవదని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీ నర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నంద్యా ల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, సుదాకర్‌రెడ్డి, అంజద్‌బాషా, చాంద్‌బాషా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బిషప్ చర్చిలో టీజీ భరత్ ప్రార్థనలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 25: కర్నూలు అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టీజీ భరత్ నగరంలోని బిషప్ చర్చిలో కర్నూలు పీఠం 5వ కాపరి గోరంట్ల జ్వాన్నేమను కలిశారు. ఈ సందర్భంగా ఆయన తన నామి నేషన్ పత్రాలను కర్నూలు పీఠం కాపరి గోరంట్ల జ్వాన్నేమకు అందజేసి ఆశీ ర్వాదాలు తీసుకున్నారు. అనంతరం జరిగిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు.

టీజీ భరత్‌కు వేదాశీర్వాదం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 25: కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌కు గురువారం వేదపండితులు, పురోహితులు వేదాశీర్వాదం అందజేశారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల టీజీ భరత్ స్వగృహంలో ఆయన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయబోయేందుకు బయలేదేరుతుండగా, 25 మంది వేద పండితులు, పురోహితులు, ఇతర బ్రాహ్మణ సంఘాల నాయకులు ఆయనకు వేదాశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవ స్థాపక అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, కార్యదర్శి టీవీ రవిచంద్ర శర్మ, టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు సముద్రాల శ్రీధర్, టీడీపీ రాష్ట్ర పార్టీ బ్రాహ్మ ణ సాధికార సమితి కమిటీ సభ్యుడు దావనగేరి ఆనందరావు, ఏపీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామరాజు, కర్నూలు బ్రాహ్మణ జేఏసీ కన్వీనర్ హెచ్ దేవీ ప్రసాద్, వేద పండితుడు లోకేషాచారి పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి విజయానికి కృషి

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 25: జిల్లాలో ఎన్‌డీఏ కూటమి విజయానికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర తెలిపారు. గురువారం నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డినగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లాలో బీజేపీలో కలత చెంది, ఆ పార్టీకి రాజీనామా చేశానని, అయితే బీజేపీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గం సంప్రదింపులు చేశారని, భవిష్యత్తులో తనకు సముచిత స్థానం కల్పిస్తారని హామీ ఇచ్చారని తెలిపారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ, జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య పాల్గొన్నారు.

రేపు ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: ఈ నెల 27వ తేదీ ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ, ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించనున్న స్క్రూటినీ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆర్వోలను ఆదేశించారు. ఈ ప్రక్రియ నిర్వహించే సమయంలో ఖచ్చితంగా నిరంతరాయంగా వీడియోగ్రఫీ చేయించాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఉంటే ఆడియో, వీడియో సక్రమంగా పని చేసేలా చూసుకోవాలని సూచించారు. మే 5 నుంచి 8వ తేదీ వరకు ఆయా నియోజకవర్గాల కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోలింగ్ స్టాఫ్, ఎసెన్షియల్ సర్వీసెస్ వాటికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. హోం ఓటింగ్ ప్రక్రియను 6, 7, 8 తేదీల్లో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో పాణ్యం రిటర్నింగ్ అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, కోడుమూరు ఆర్వో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్వో, ఆర్డీవో రామలక్ష్మి, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, మంత్రాలయం ఆర్వో మురళి పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రావడం ఖాయం

టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



ఉల్చాలలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్)ఏప్రిల్ 25: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం కర్నూలు రూరల్ మండలం ఉల్చాల, ఎల్‌పేట గ్రామంలో బొగ్గుల దస్తగిరి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యతల అందరిపై ఉందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు ఆ పార్టీ నేతలు దోచుకోవడం, దాచుకోవడం తప్ప గ్రామాల్లో అభివృద్ధి చేసిన దాఖ లాలు లేవన్నారు. వైసీపీ నాయకులు చేసిన వైఫల్యాలే టీడీపీని గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉల్చాల ఎంపీటీసీ శివన్న, బుర్ర వెంక టేష్, హనుమంతు, భీసన్న, రాంపులి, ప్రభాకర్, మల్దకల్, మద్దిలేటి, చిన్న య్య, రాంబాబు, నాగన్న, ఎల్‌పేట నాయకులు హనుమన్న, శ్రీరాములు, విజయ్, ఓబులేసు, కృష్ణుడు, రామాంజనేయులు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, చిన్న ఎల్లయ్య, నాగరాజు, చిన్న దస్తగిరి పాల్గొన్నారు.



నేడు భ్రామరికి కుంభోత్సవం



కుంభోత్సవ ఏర్పాట్ల సమీక్షలో ఈవో, అధికారులు

శ్రీశైలం, ఏప్రిల్ 25: శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం భ్రమరాంబికాదేవికి వార్షిక కుంభోత్సవం కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. కుంభోత్సవ ఏర్పాట్లును దేవస్థానం ఇప్పటికే పూర్తి చేసింది. శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలు సంపూర్ణంగా జరిపించాలన్నారు. అదేవిధంగా దేవదాయ చట్టం ప్రకారం క్షేత్ర పరిధిలో జంతు, పక్షి బలులను పూర్తిగా నిషేధించామని, ఈ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని ధికారులను ఆదేశించారు. కుంభోత్సవం తర్వాత అమ్మవారి దర్శనం క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దేవస్థానం భద్రతా విభాగపు పర్యవేక్షకులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. ప్రసాదరావు, ఎస్సై గంగయ్య యాదవ్, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి. రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, ఏఈవోలు మోహన్, హరిదాసు, మల్లికార్జునరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకులను కలిసిన ఆర్‌ఓ



ఎన్నికల పరిశీలకులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌ఓ

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 25: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులను కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ప్రభుత్వ అతిథి గృహంలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు పీసీ.జాఫర్, పత్తికొండ, ఆదోని, ఆలూరు ఎన్నికల పరిశీలకుడు మీర్ తారీఖ్‌లను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగరేస్తాం





టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డికి గజమాల వేస్తున్న నాయకులు, కార్యకర్తలు , వేలాది సంఖ్యలో తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చైతన్యరథంపై నుంచి మాట్లాడుతున్న తిక్కారెడ్డి

- స్పష్టం చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు
- అట్టహాసంగా రాఘవేంద్రరెడ్డి నామినేషన్
- వేలాదిగా తరలివచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు
- బాలనాగిరెడ్డికి మతిభ్రమించి మాట్లాడుతున్నారు..
- బీసీ అభ్యర్థి అయినందుకే వైసీపీలో వణుకు :
- రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 25: మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, బీజేపీ ఆదోని డివిజన్ అధ్యక్షుడు హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తంరెడ్డి, జనసేన ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. గురువారం మంత్రాలయం టీడీపీ అభ్యర్థిగా రాఘవేంద్రరెడ్డి నామినేషన్ అట్టహాసంగా జరిగింది. తన నివాసమైన మాధవరం నుంచి మంత్రాలయం వరకు వేలాదిగా తెలుగు తమ్ముళ్లు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో కదంతొక్కుతూ ఈలలు, కేకలు, బాణాసంచాలు కాలుస్తూ అభివాదాలు చేస్తూ భారీ ఊరేగింపుగా సాగారు. దాదాపు 8కి.మీల మేర ర్యాలీగా వచ్చి రాఘవేంద్ర సర్కిల్ కూడలి పసుపుమయంగా మారింది. తెలుగు తమ్ముళ్ల ఉత్సాహాన్ని చూస్తుంటే.. మంత్రాలయం ఖాతాలోకి ఎమ్మెల్యేగా రాఘవేంద్రరెడ్డి అన్నట్లుగా జోష్ కనిపించింది. అంతకుముందు ర్యాలీగా వచ్చి రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎండలు సైతం లెక్క చేయకుండా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో మురళిని కలిసి రాఘవేంద్రరెడ్డి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం గజమాలతో రాఘవేంద్రరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రచార రథంపై నుంచి రాఘవేంద్రరెడ్డి మాట్లాడారు.

బాలనాగిరెడ్డికి మతిభ్రమించింది : రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

హ్యాట్రిక్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటున్న బాలనాగిరెడ్డి మతిభ్రమించి ఏదేదో మాట్లాడుతున్నారని, అలా మాట్లాడితే ఊరుకునేది లేదని టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి హెచ్చరించారు. వాల్మీకి అభ్యర్థిగా పోటీ చేస్తే బాలనాగిరెడ్డి వెన్నులో వణుకు పుట్టిందన్నారు. 15 ఏళ్ల కాలంలో ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి మంత్రాలయానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి స్పష్టం చేశారు. మంత్రాలయం దశ, దిశను మార్చి సాగు, తాగునీరు అందిస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే.. ప్రతి కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఏ కష్టమొచ్చినా అర్ధరాత్రి తలుపు తట్టినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరవ రమాకాంత్ రెడ్డి, లింగయ్య, సురేష్ నాయుడు, పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, పనలదొడ్డి ఈరన్న, జ్ఞానేష్, విష్ణు, రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, రంజిత్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం, కోసిగి మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల నామినేషన్ పర్వం

- ఆదోని నియోజకవర్గంలో 23 నామినేషన్‌లు దాఖలు

ఆదోని, ఏప్రిల్ 25: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేటితో నామినేషన్‌లు దాఖలు ప్రక్రియ ముగిసిందని ఆదోని ఎన్నికల అధికారి, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పేర్కొన్నారు. ఆదోని నియోజకవర్గంలో నామినేషన్‌లు గడువులోగా 23 నామినేషన్‌లు దాఖలు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 26వ తేదీన స్రూనిటీని 27,29వ తేదీన నామినేషన్‌ల ఉపసంహరణ జరుగుతుందన్నారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

ఆదోని టౌన్, ఏప్రిల్ 25: పట్టణ పరిధిలోని వివిధ పోలింగ్ స్టేషన్‌లను మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి గురువారం సిబ్బందితో కలసి పరిశీలించారు. పోలింగ్ రోజు పోలింగ్ సిబ్బందికి కాని, ఓటర్లుకు కాని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, లైట్లు, భవనాలకు కావాల్సిన చిన్నపాటి మరమ్మత్తుల పై ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించినట్లు కమిషనర్ తెలిపారు. పట్టణంలో మొత్తం 159 పోలింగ్ స్టేషన్‌లలో 60 పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు.

టీడీపీని గెలిపించుకుందాం: మాజీ జెడ్పీవైస్ చైర్మన్

నందవరం, ఏప్రిల్25: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ పుష్పావతి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడు అన్నారు. గురువారం నందవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి పత్తిపాటి నాగరాజుకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని, జగన్ ఇంటిదారి పడతారని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టబోయే సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ కన్వీనర్ డివి రాముడు, నాయకులు కాశీంవలీ,గురురాజారావు, మస్తాన్, రహిమాన్ పాల్గొన్నారు.

రమణీయం.... రాఘవేంద్రుల స్వర్ణ పల్లకోత్సవం

మంత్రాలయం, ఏప్రిల్ 4 : రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. గురువారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం పండితులు,అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి రమణీయంగా ఊరేగించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేషపూజలు చేసిమొక్కులు తీర్చుకున్నారు.

మంత్రాలయంలో కిక్కిర్సిన భక్తులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిర్సింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహాదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. క్యూలైన్‌న్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది.

వక్ఫ్ బోర్డు అధికారులతో వాగ్వాదం

హొళగుంద, ఏప్రిల్ 25: జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఎల్లార్తి హజరత్ శేక్షావలి, షాషావలి సాహెబ్‌ల దర్గా ఆరు నెలల హుండీ లెక్కింపు సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురువారం విజయవాడ నుంచి వచ్చిన వక్ఫ్‌బోర్డ్ ఈవో అబ్దుల్ ఖుద్దుస్, సూపరిడెంట్ షేక్ హైదర్ బాషాలతో ఎల్లార్తి గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో ఎల్లార్తి దర్గా వక్ఫ్ బోర్డ్ ఆధీనంలోకి చేరిందని, అప్పటి నుంచి నేటి వరకు దర్గా నుంచి వక్ఫ్‌బోర్డ్‌కు కోట్ల రూపాయలు ఆదాయం సమకూరిందని అన్నారు. అయినా దర్గా అభివృద్ధికి ఎటువంటి ఖర్చులు చేయలేదని, కేవలం హుండీ డబ్బు కోసం అధికారులు వస్తున్నారని మండిపడ్డారు. అలాగే కొందరు గ్రామ పెద్దలు అని చెప్పుకునే వారు దర్గాను దోచుకున్నారని, వాటి పై విచారణ చేపట్టాలని నిలదీశారు దీంతో అధికారులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అలాగే ఎల్లార్తి దర్గా ఈవో అబ్దుల్ రెహ్మాన్ పై వచ్చిన పలు ఆరోపణలపై విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం పోలీసుల సహకారంతో హుండీ లెక్కింపు కార్యక్రమానికి అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దినేష్‌కుమార్, వీఆర్వో ప్రహలద్, ఎస్ఐ పెద్దయ్యనాయుడు, కానిస్టేబుళ్లు గురుప్రసాద్ , రామాంజనేయరెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి : మీనాక్షినాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 25: చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే తెదేపా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షి నాయుడు అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని చిన్న శక్తిగుడి ప్రాంతంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధితో కలిసి ఆయన ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తెదేపా ప్రభుత్వంలో చేనేతల జీవితాలలో వెలుగుని నింపామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక చేనేతలు నేసిన వస్త్రాలకు కనీసం మార్కెటింగ్ చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. దగాకోరు వైసీపీని, గుండాగిరి ఎమ్మెల్యేను ఇంటికి సాగనంపాల్సిన సమయం వచ్చిందన్నారు. టీడీపీ,బీజేపీ,జనసేన బలపరిచిన అభ్యర్థి పార్థసారథిని గెలిపిస్తే, ఆదోనిని అన్ని విధాలుగా కేంద్ర, రాష్ట్ర నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. రోల్ మోడల్ నియోజకవర్గంగా తయారు చేస్తామని తెలిపారు. అభ్యర్థి డాక్టర్ పార్థసారధి మాట్లాడుతూ ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, స్వేచ్ఛగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెదేపా కూటమి అధికారంలోకి వస్తుందని తాను గెలిస్తే అన్ని విధాలుగా చేనేతలకు అండగా ఉండి అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అంతకుముందు శక్తిగుడిలో పూజలు చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, గుడిసె కృష్ణమ్మ, భాస్కర్ రెడ్డి, మల్లేకర్ శ్రీనివాసులు, సాయి పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో బతుకే భారమైంది




చేనేతల ఆత్మయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ సంజీవ్‌కుమార్, వేదికపై టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి ఒంకతి లక్ష్మీనారాయణ, మాచాని సోమనాథ్ తదితరులు, హాజరైన చేనేత కుటుంబాలు

- వైసీపీ అభ్యర్థి రుణాలు మాఫీ చేసుకునేందుకు వచ్చారు : ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్
- నేతన్న నేస్తం కొందరికే : బీవీ

ఎమ్మిగనూరు , ఏప్రిల్25: వైసీపీ ప్రభుత్వంలో ప్రజల బతుకు భారంగా మారిందని ఎంపీ సంజీవ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో చేనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీ సంజీవ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొంకతి లక్ష్మీనారాయణ, టీడీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మాచాని సోమనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సేవలు చేసే నాయకులు కావాలో.. ఎక్కడో హైదరాబాదులో ఉండే నాయకులు కావాలో తేల్చుకోవాలని సూచించారు. వైసీపీ అభ్యర్థి ప్రజా సేవ కోసం రాలేదని, బ్యాంకుల్లో తన రుణాల మాఫీ కోసం వచ్చారని అన్నారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో రూ.73కోట్ల రుణాలు మాఫీ చేయించుకున్నారని గుర్తుచేశారు. అదేమొత్తం ప్రజల కోసం ఖర్చు చేసి ఉంటే ఎమ్మిగనూరు పట్టణంలో ఇంటింటికి కుళాయి వచ్చేదన్నారు. బీవీ జయనాగేశ్వరరెడ్డి నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సేవే ధ్యేయంగా తనతండ్రి బీవీ మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నారని, ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం మనందరికి ఉందని స్పష్టం చేశారు. జయనాగేశ్వరరెడ్డి ఎన్నికల్లో 30వేల మెజార్టీతో తప్పకుండా గెలుస్తారని సర్వేలు చెబుతున్నాయన్నారు. అనంతరం కొంకతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చేనేతలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. మాచాని సోమనాథ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో సామాన్యులు కొనలేనంతగా నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోయాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి దేవేంద్ర, నాయకులు శివకుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, మిఠాయి నరసింహులు, రంగస్వామిగౌడు, బిజ్జె నాగరాజు, రామకృష్ణనాయుడు, పట్టా నాగరాజు, సుందర్‌రాజు, మిన్నప్ప, నాగరాజు, గాజుల సుధాకర్, బీజేపీ నాయకులు రామలింగప్ప లు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం కొందరికే : బీవీ

వైసీపీ ప్రభుత్వం ఎమ్మిగనూరులో నేతన్న నేస్తం కొద్దిమందికే ఇచ్చి చేతులు దులుపుకుందని టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. చేనేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో అన్ని రకాల పన్నులు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని విమర్శించారు. సామాజిక న్యాయం పేరుతో బీసీల పట్ల కపట ప్రేమను ఒలకబోస్తున్నారని విమర్శించారు. సొంత చెల్లెల్లకు న్యాయం చేయలేని జగన్ ఇక సామాన్య ప్రజలకు ఏమి చేస్తారని ప్రశ్నించారు. చేనేతల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. నేతన్ననేస్తం అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడంతో పాటు ముడిసరుకులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఎంఎస్‌నగర్‌లో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు.



మాట్లాడుతున్న జయనాగేశ్వరరెడ్డి

టీడీపీతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం

● టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ ● నియోజకవర్గంలో విస్తృత ఎన్నికల ప్రచారం ● మూసనహల్లి, అంగసకల్ గ్రామాల నుంచి వైసీపీ నాయలకు చేరిక

ఆలూరు, ఏప్రిల్ 25: జగన్ ఐదేళ్ల పాలనలో గ్రామాలు వల్లకాడుగా మారాయని, పల్లెల్లో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గురువారం ఆలూర మండలం మూసహల్లి, కాత్రికి, కమ్మరచేడు, హాలేబీడు గ్రామాల్లో జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్పతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతాయన్నారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్ ప్రయాణం, ఏడాదికి రూ.3 సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఫించన్లు, ఏడాది కి రైతన్నలకు రూ.20 వేలు, యువగళం పథకం ద్వారా యువతకు 50 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ముఖ్యంగా సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కలిగేలా వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహిళలు కలశాలతో ఘనస్వాగతం పలికారు. కమ్మరచేడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేశారు. హాలేబీడు గ్రామంలో వికలాంగులతో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాగుంలకు పెన్షన్ రూ.6 వేలకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్, టీడీపీ నాయకులు నారాయనప్ప, గోపాల్, సోమశేఖర్, దేవేంద్ర, రాజశేఖర్, మహేంద్ర రెడ్డి, మద్దిలేటి, అంజి పాల్గొన్నారు.




ముసానహళ్లిలో సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్

టీడీపీలోకి భారీగా వలసలు

ఆలూరు మండలంలో వైసీపీ నాయకులు, క్యాకర్తలు భారీగా టీడీపీలోకి చేరారు. కమ్మరచేడు, మూసనహల్లి, అంగసకల్ గ్రామాల నుంచి 100 మంది టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్, జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కమ్మరచేడు గ్రామ వైసీపీ నాయకులు మహీందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 50కుటుంబాల ముఖ్య నాయకులు టీడీపీలో చేరారు. మునసపల్లి వైసీపీ సర్పంచ్ భర్త సోమశేఖర్‌తో పాటు ఆయన అనుచరులు 40 కుటుంబాలు కూడా పార్టీలో చేరారు. అలాగే ఆస్పరి మండలం ములుగుందం గ్రామం వైసీపీ నాయకులు డిష్ హనుమంతు, వార్డు మెంబర్ గంగప్ప, కరిలింగప్ప, ఉలువ ముద్దన్న, బసిరాళ్ల దస్తగిరి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని వీరభద్ర గౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థిస్తున్న వీరభద్రగౌడ్